త్వరలో హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్

వచ్చే జనవరి-మార్చిలో మార్కెట్‌లోకి • మరో మూడు ఈవీ మాడళ్లూ రాక

న్యూఢిల్లీ, జూన్ 17: హ్యుందాయ్ మోటర్ ఇండియా.. విద్యుత్తు ఆధారిత వాహనాలపై (ఈవీ) దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఆఖరు (వచ్చే ఏడాది జనవరి-మార్చి)కల్లా దేశీయ మార్కెట్‌కు 4 ఎలక్ట్రిక్ వెహికిల్ మాడళ్లను పరిచయం చేయాలనుకుంటున్నది. వీటిలో పాపులర్ క్రెటా మాడల్ కూడా ఉన్నది. ఈ మేరకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దాఖలు చేసిన పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) పేపర్లలో హ్యుందాయ్ పేర్కొన్నది. అయితే ధర, ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించగలదన్న వివరాలు తెలియరాలేదు. రూ.25,000 కోట్ల భారీ ఐపీవోతో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి హ్యుందాయ్ ప్రవేశించాలనుకుంటున్న విషయం తెలిసిందే. కాగా, ప్రస్తుతం భారతీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈవీల సందడి ఎక్కువగా కనిపిస్తున్నది. పర్యావరణ సమస్యలు, ఇంధన ధరల నడుమ వినియోగదారులు సైతం ఈవీ కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు. ఇక టాటా మోటర్స్ మిగతా అన్నింటికంటే ఎక్కువ మాడళ్లతో మార్కెట్‌లో దూసుకుపోతున్నది. దీంతో ఈ పోటీలో ముందు నిలిచేందుకు హ్యుందాయ్ కూడా క్రెటాసహా మరికొన్ని ఈవీ మాడళ్లను తేవాలని నిర్ణయించుకున్నది. ఈ క్రమంలోనే భారత్‌లో సెల్స్, బ్యాటరీ ప్యాక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ తదితర విడిభాగాల ఉత్పత్తి దిశగా అడుగులు వేస్తున్నది. ఇప్పటికే అయోనిక్5, కోనా ఎలక్ట్రిక్ కార్లను హ్యుందాయ్ దేశీయంగా విక్రయిస్తున్నది విదితమే. రూ.45 లక్షలు, రూ.24 లక్షల శ్రేణిలో వీటి ధరలున్నాయి. ఇదిలావుంటే ఈవీ చార్జింగ్ స్టేషన్ల నిర్మాణంపైనా సంస్థ ఆసక్తి చూపుతున్నది. దేశవ్యాప్తంగా కంపెనీకి 11 చార్జింగ్ స్టేషన్లున్నాయి. జాతీయ రహదారులపై అన్ని నగరాల్లో మరిన్ని తేవాలని చూస్తున్నది.

పోటెత్తిన పసిడి దిగుమతులు

- **గత ఆర్థిక సంవత్సరం యూఏఈ నుంచి 210% పైకి**
- **స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రభావం**

న్యూఢిల్లీ, జూన్ 17: గత ఆర్థిక సంవత్సరం (2023-24) యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి భారత్‌కు బంగారం, వెండి దిగుమతులు పోటెత్తాయి. గతంతో పోల్చితే ఏకంగా 210 శాతం ఎగిసి 10.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. యూఏఈతో భారత్ కున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమే (ఎఫ్‌టీఏ) ఇందుకు కారణమని సోమవారం విడుదలైన గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక చెప్తున్నది. ఈ క్రమంలో యూఏఈతో ఉన్న ఎఫ్‌టీఏ నిబంధనల్ని సవరించాల్సిన అవసరం ఉన్నదని కూడా ఈ ఆర్థిక మేధో దిగ్గజం అభిప్రాయపడింది. ఇక భారత్-యూఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) కింద ఇస్తున్న కస్టమ్స్ సుంకాల రాయితీపై పునరాలోచనలు చేసుకోకపోతే ఇబ్బందులేనని కూడా హెచ్చరించడం గమనార్హం. ప్రస్తుతం సీఈపీఏ కింద యూఏఈ నుంచి దేశంలోకి ఎంతైనా వెండి దిగుమతి చేసుకోవచ్చు. సాధారణంగా వర్తించే కస్టమ్స్ సుంకం కూడా 7 శాతం తక్కువే. దీనివల్ల గత ఆర్థిక సంవత్సరం ఖజానాకు రూ.1,010 కోట్ల ఆదాయం దూరమైందని జీటీఆర్ఐ తెలిపింది. అన్నారు. ప్రస్తుతం 15 శాతంగా సుంకం ఉన్నదని గుర్తుచేశారు. దీన్ని 5 శాతానికి తగ్గిస్తే స్మగ్లింగ్ పెద్ద ఎత్తున తగ్గుతుందని సూచించారు. కాగా, అంతకుముందుతో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం భారత్‌లోకి యూఏఈ నుంచి జరిగిన మొత్తం దిగుమతులు 9.8 శాతం పడిపోయాయి. 2022-23లో 53.2 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2023-24లో 48 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అయినప్పటికీ ఇదే సమయంలో బంగారం, వెండి దిగుమతులు 3.5 బిలియన్ డాలర్ల నుంచి 10.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఆభరణాల వాటా కూడా ఇందులో పెద్ద ఎత్తునే ఉన్నది.

స్మగ్లింగ్‌కు చెక్ పెట్టాలి

అధిక దిగుమతి సుంకాలతో దేశంలోకి బంగారం, వెండి స్మగ్లింగ్ పెరుగుతున్నదని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ 160 టన్నుల పుత్తడి దిగుమతిపై సుంకాల్లో 1 శాతం రాయితీ వస్తున్నది. 2022 ఫిబ్రవరిలో సీఈపీఏపై ఇరు దేశాల సంతకాలు జరిగాయి. అదే ఏడాది మే నెల నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చింది.

గిఫ్ట్ సిటీ సెగ

గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలోగల ఇండియా ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్ఛేంజ్ (ఐఐబీఎక్స్) ద్వారా కూడా యూఏఈ నుంచి పసిడి, వెండి దిగుమతులు చేసుకొనేలా ప్రైవేట్ సంస్థలకు మోదీ సర్కారు అవకాశం ఇచ్చింది. అంతకుముందు ఆథరైజ్డ్ ఏజెన్సీలకే ఈ వీలుండేది. ఫలితంగా దేశ వాణిజ్య లోటు పెరిగిపోతున్నది. దీంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సొంత రాష్ట్రంలోని గిఫ్ట్ సిటీ ఉన్నతికి తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయిప్పుడు.

హైదరాబాద్‌కు జేబీపీ

ముంబై, జూన్ 17: వజ్రాల తయారీదారు జ్యువెల్స్ బై ప్రీతి (జేబీపీ) విస్తరణ బాట పట్టింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌తోపాటు ముంబై, ఢిల్లీ, బెంగళూరు, పుణె, చెన్నై, కోల్‌కతా, అహ్మదాబాద్‌ల్లో స్టోర్లను ఏర్పాటు చేయబోతున్నది. ఈ ఏడాది ఆఖరుకల్లా దేశవ్యాప్తంగా 15 స్టోర్లను తెస్తామని సోమవారం కంపెనీ వ్యవస్థాపకులు ప్రీతి జైన్ తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ప్యాకేజీని పెంచాలి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): అతి తక్కువ పెన్షన్‌తో రిటైర్డ్ బొగ్గు గని కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని, పెట్రోలియం కంపెనీల తరహాలో కోల్ ఇండియా, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకూ ఆర్థిక ప్యాకేజీని వర్తింపజేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం సింగరేణి భవన్‌లో సింగరేణి గుర్తింపు సంఘం నాయకులతో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామచందర్‌రావు వినతి పత్రాన్ని సమర్పించారు.

తరాలు మారినా.. తరగని బంధం

కలిసికట్టుగా రుయా సోదరులు

దేశ, విదేశీ వ్యాపారాలను ఒక్కటై నడిపిస్తున్న ఉమ్మడి కుటుంబం

తల్లిదండ్రులు-బిడ్డల మధ్య వారసత్వ తగాదాలు.. అన్నదమ్ముల నడుమ ఆస్తుల గొడవలు.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో ఉన్నాయి. అయితే ఈ తగువులకు దేశంలోని వ్యాపార కుటుంబాలూ అతీతం కాదు. ఇంకా చెప్పాలంటే వీళ్ల మధ్యే అధికం. అలాంటి ఘటనల్ని చూశాం.. చూస్తూనే ఉన్నాం కూడా. కానీ రుయా సోదరులు ఇందుకు మినహాయింపు. తరాలు మారినా తరగని బంధంతో కలిసికట్టుగా నడుస్తున్నారు మరి. దేశ, విదేశీ వ్యాపారాల నిర్వహణలో ఈ ఉమ్మడి కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది.

తమ వారసులతో ఎస్సార్ గ్రూప్ వ్యవస్థాపక సోదరులు రవి రుయా, శశి రుయా

న్యూఢిల్లీ, జూన్ 17: వ్యాపారంపై పట్టు కోసం రోడ్డెక్కుతున్న వారసులను ఇటీవలి కాలంలో ఎందర్నో చూస్తున్నాం. తమ తాతలు, తండ్రుల సంపద కోసం కోర్టుల్లో ఏండ్ల తరబడి పోరాడుతున్నవారూ ఉన్నారు. అంబానీలు, హిందుజా సోదరులతోపాటు ఎస్కార్ట్స్, రేమండ్స్, అపోలో టైర్స్, కేకే మోదీ కుటుంబ గొడవలు తెలిసిందే. కానీ ఎస్సార్ రుయా కుటుంబం మాత్రం తమదైన రీతిలో ఒక్కటై విజయాలను సాధిస్తున్నది. మెటల్స్ దగ్గర్నుంచి పోర్టులదాకా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూపోయిన శశి రుయా, రవి రుయాలకు.. వారి కుటుంబ సభ్యులే పెద్ద బలం. అవును.. వారి పిల్లలు, వాళ్ల పిల్లలు ఇలా మూడు తరాలు తరగని బంధంతో ఒక్కటై వెళ్తున్నారు. దేశ, విదేశాల్లోని వ్యాపారాలను ఉమ్మడిగా నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

55 ఏండ్లపైనే..

1969లో తొలి తరం రుయాలైన శశి, రవి రుయా సోదరులు ఎస్సార్ గ్రూప్‌ను స్థాపించారు. అప్పుడే మద్రాస్ పోర్ట్ ట్రస్టు నుంచి రూ.2.5 కోట్ల విలువైన మొదటి ఆర్డర్‌ను అందుకున్నారు. అప్పట్నుంచి క్రమేణా వ్యాపారాలను విస్తరించుకుంటూ పోయారు. నిజానికి తొలినాళ్లలో నిర్మాణ, ఇంజినీరింగ్ రంగాలపైనే రుయాలు దృష్టిపెట్టారు. కానీ 1980వ దశకంలో విద్యుత్తు, చమురు, గ్యాస్ రంగాల్లోకీ వచ్చారు. ఇక 1990ల్లో ఉక్కు, టెలికం రంగంలోకీ ప్రవేశించారు. అయితే వ్యాపార విస్తరణలో భాగంగా తీసుకున్న రుణాలు.. రుయాలను అప్పుల ఊబిలోకి నెట్టాయి. నిజానికి

> *కుటుంబ సభ్యులందరం కలిసే ఉంటాం. గ్రూప్‌లోని ఒక్కో వ్యాపార విభాగాన్ని ఒక్కొక్కరం చూసుకుంటాం. లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం సమష్టిగా కృషి చేస్తాం. ఆలోచనల్ని, సంతోషాల్ని పంచుకుంటాం. సలహాల్ని ఇచ్చి పుచ్చుకుంటాం. కొత్త తరాలు వస్తున్నా.. మా ఈ బంధం బలపడుతూనే ఉండటం ఆనందంగా ఉన్నది. 12 ఏండ్ల వయస్సు నుంచే నేను సెలవు రోజుల్లో నాన్నతో కలిసి పనిచేయడం మొదలు పెట్టాను. కుటుంబంలోని పెద్దవారంతా తర్వాతి తరాలకు ఉమ్మడి కుటుంబం లాభాలను వివరిస్తూపోతున్నాం.*
>
> **-ప్రశాంత్ రుయా, శశి రుయా కుమారుడు**

అంతా ఒక్కమోటనే..

ముంబై, ఢిల్లీ, లండన్‌లలో రుయా సోదరుల కుటుంబాలు దాదాపు 60 ఏండ్లుగా కలిసే జీవిస్తున్నాయి. కొడుకులు, మనుమలు-మనుమరాండ్లు కుటుంబ వ్యాపారాలను ఒక్కటై చూసుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్సార్ గ్రూప్.. ఎనర్జీ, మెటల్స్, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాజిస్టిక్స్, టెక్నాలజీ, రిటైల్ రంగాల్లో వ్యాపారాలను నిర్వహిస్తున్నది. 14 పోర్ట్‌ఫోలియో కంపెనీలున్నాయి. భారత్‌తోపాటు బ్రిటన్, వియత్నాంలలో ఆయిల్ రిఫైనరీ, పవర్ ప్లాంట్లున్నాయి. 35కుపైగా దేశాల్లో ఐటీ సొల్యూషన్స్‌ను అందిస్తున్నది. రెన్యువబుల్స్ ఎనర్జీలోకీ ప్రవేశించింది. గ్రూప్ రెవిన్యూ దాదాపు 15 బిలియన్ డాలర్లు. ఆస్తులు సుమారు 8 బిలియన్ డాలర్లపైనే.

2012లో ప్రపంచంలోనే అత్యంత భారతీయ ధనవంతులుగా రుయా సోదరులు 7 బిలియన్ డాలర్ల సంపదతో ఫోర్బ్స్ జాబితాలో నిలిచారు. అయితే పెరిగిన రుణ భారాన్ని దించుకునే క్రమంలో టెలికం సంస్థను, ఆయిల్ రిఫైనరీ, స్టీల్ ప్లాంట్లను అమ్ముకోవాల్సి వచ్చింది. ఇలా రూ.2 లక్షల కోట్లకుపైగా రుణాలను తగ్గించుకున్నారు. ఇప్పుడు ఎస్సార్ గ్రూప్ తిరిగి ఆవిష్కృత

మారనున్న ఆదాయ పన్ను రేట్లు?

న్యూఢిల్లీ, జూన్ 17: వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) రేట్లు మారనున్నట్టు తెలుస్తున్నది. వచ్చే నెలలో కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నది. మధ్యతరగతి వేతన జీవులకు ఊరటనిచ్చేలా పన్ను రేట్లలో మార్పులు చేయవచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో వినిమయ శక్తిని పెంపొందించాలన్న కోణంలోనూ దీన్ని మోదీ సర్కారు పరిశీలిస్తున్నట్టు సమాచారం. వార్షిక ఆదాయం రూ.10 లక్షల నుంచి 15 లక్షల మధ్య ఉన్నవారికి, ఆపై ఆదాయమున్న వర్గాలకు ఊరటనిచ్చేలా పన్ను రేట్లను తగ్గిస్తారన్న ఊహాగానాలున్నాయి.

సింగరేణి ఐటీ విభాగానికి జాతీయ బహుమతి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల సమాచారం, సేవలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)ని విస్తృతంగా వాడుతున్నందుకు సింగరేణి సంస్థ ఐటీ విభాగానికి జాతీయ అవార్డు దక్కింది. అత్యుత్తమ ఐటీ సేవలకుగాను కంప్యూటర్ ఎక్స్‌ప్రెస్ సంస్థ అందజేసే అవార్డును ఆదివారం రాత్రి రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ కేటగిరిలో సింగరేణికి ప్రదానం చేశారు. సోమవారం ఉదయం సింగరేణి భవన్‌లో కో-ఆర్డినేషన్ జీఎం జీ దేవేందర్, ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్ హరప్రసాద్, ఐటీ డిప్యూటీ మేనేజర్లు హరిశంకర్, హరిప్రసాద్, మేనేజర్ రామ లక్ష్మయ్యలు ఈ పురస్కారాన్ని సింగరేణి సంస్థ సీఎండీ బలరాంకు అందజేశారు. అవార్డు లభించడం పట్ల ఆయన ఉద్యోగులను అభినందించారు.

కార్యకర్తకు బీఆర్ఎస్ అండ

- **గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**
- **రూ.2లక్షల బీఆర్ఎస్ బీమా చెక్కు అందజేత**

బీఆర్ఎస్ బీమా చెక్కు అందజేస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జూన్ 17: ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఇటీవల గద్వాలలోని 32వ వార్డుకు చెందిన పార్టీ కార్యకర్త నెమలికంటి ఆంజనేయులు రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. ఆంజనేయులు పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ తరపున రూ.2లక్షల బీమా చెక్కు మంజూరైంది. సోమవారం ఎమ్మెల్యే బండ్ల బీమా చెక్కును బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

న్యాయం చేయండి సార్..

- **డీఎస్పీని ఆశ్రయించిన మహిళ**
- **పెండ్లి చేసుకొని మోసం చేశాడని ఆరోపణ**

గద్వాల అర్బన్, జూన్ 17: పెండ్లి చేసుకొని మోసం చేశాడని, న్యాయం చేయాలని ఓ మహిళ సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. వివరాలిలా.. మానవపాడు మండలంలోని ఏబూడిదపాడుకు చెందిన బషీర్ ట్రైల్స్ పనిచేసేవాడు. బషీర్ సామాజిక మాధ్యమాల్లో ఏడాది కిందట ఏపీలోని తిరుపతి జిల్లా కోట మండలంలో ఓ గ్రామానికి చెందిన నిహారికతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త పెండ్లికి దారి తీసింది. అయితే నిహారికకు గతంలో పెండ్లి అయిందని, తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, అనివార్య కారణాలతో భర్తతో ఉండడం లేదని పేర్కొంది. భర్త నుంచి దూరంగా ఉన్న నిహారిక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పిల్లలతో కలిసి ఉండేది. బషీర్, నిహారిక ఇద్దరు తిరుపతిలో ఓ ప్రాంతంలో పెండ్లి చేసుకొని అక్కడే ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం మొదలు పెట్టారు. పెండ్లి అనంతరం రెండు నెలలు గడిచిన తర్వాత నిహారికకు చెప్పకుండా సొంతింటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న నిహారిక స్థానికుల సహకారంతో 15రోజుల కిందట బషీర్ ఇంటికి చేరుకొని తనను భార్యగా అంగీకరించాలని బషీర్‌ను కోరగా.. నీకు నాకు ఏమీ సంబంధం లేదు.. ఇక్కడి నుంచి వెళ్లిపో.. అంటూ సమాధానమిచ్చాడు. ఈ క్రమంలో నిహారిక శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి తన సమస్యను వివరించింది. బషీర్ అతని కుటుంబ సభ్యులు తనపై దాడిచేసినట్లు చెప్పినా ఎస్సై పట్టించుకోలేదని ఆరోపించింది. దీంతో దిక్కుతోచని స్థితిలో సోమవారం డీఎస్పీ సత్యనారాయణను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై డీఎస్పీని వివరణ కోరగా.. నిహారిక ఫిర్యాదుపై శాంతినగర్ సీఐతో విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

డీఎస్పీ కార్యాలయం వద్ద నిహారిక

హోటల్ యజమానిపై దాడి

- **నిందితుల రిమాండ్**

బాలానగర్, జూన్ 17 : మండల కేంద్రంలోని ఓ హోటల్ యజమానిపై దాడిచేసిన ఘటనలో ముగ్గురు నిందితులను సోమవారం జడ్చర్లలో సీఐ నాగార్జున్‌గౌడ్ సమక్షంలో రిమాండ్ చేసినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బాలానగర్‌లోని హోటల్‌లో ఆదివారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో సేవాలాల్ శ్రీనునాయక్, ఆయన అనుచరులు భాస్కర్, రమేశ్, మహేశ్ భోజనానికి వెళ్లారు. భోజనం అనంతరం బిల్లు చెల్లించకుండా సిబ్బందితో గొడవకు దిగారు. అంతేకాకుండా హోటల్ యజమాని జావీద్‌అలీ ఇంటికి వెళ్లి ఆయనతో గొడవపడి దాడిచేసి కొట్టారు. అనంతరం నిందితులు జావీద్‌అలీ కారును తీసుకుని వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం

- **కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు**

ఉండవెల్లి, జూన్ 17 : కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలైన ఘటన సోమవారం అలంపూర్ చౌరస్తాలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రవల్లి మండలం బీచుపల్లికి చెందిన ఏబీడీ లిక్కర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న దీపకుగుప్తా, హుసేనయ్య, డ్రైవర్ శివకుమార్‌తో కలిసి కారు(స్కార్పియో)లో కర్నూల్‌కు బయలుదేరారు. ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా ఉత్తరపుడ్స్ కంపెనీ సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో 108లో కర్నూల్ దవాఖానకు తరలించారు.

బోల్తా పడిన స్కార్పియో

గట్టులో పట్టపగలే చోరీ

- **10తులాల బంగారం, రూ. 80వేల నగదు చోరీ**

గట్టు, జూన్ 17: మండల కేంద్రంలో పట్టపగలే చోరీ చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. గట్టుకు చెందిన కుర్వ నర్సింహులుకు గంగిమాన్‌దొడ్డికి వెళ్లేదారిలో రెండు పోర్షన్ల ఇల్లు ఉంది. కుటుంబ సభ్యులు తాళాలు వేసి పొలానికి వెళ్లారు. కాగా నర్సింహులు మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా.. రెండు వేసిన తాళాలు ధ్వంసమై ఉండడాన్ని గమనించాడు. వెంటనే రెండు ఇండ్లల్లోకి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి ఉన్నాయి. బీరువాలోని దుస్తులతోపాటు వస్తువులనీ చిందరవందర చేసిన దుండగులు 10తులాల బంగారు ఆభరణాలు, రూ.80వేల నగదు దోచుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారామిచ్చారు. కాగా ఘటనా స్థలాన్ని సీఐ భీమ్‌కుమార్ సందర్శించారు. పోలీసు జాగిలంతో చోరీ జరిగిన ప్రాంతాన్ని క్షణ్ణంగా పరిశీలింపజేశారు. బాధితుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ

ఊట్కూర్, జూన్ 17 : మండలకేంద్రంలో బొడ్రాయి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నైవేద్యంతో బొడ్రాయికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన చేసి మూడు సంవత్సరాలు పూర్తి కావడంతో పండుగ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గుంత

బాలానగర్, జూన్ 17 : మండలంలోని పెద్దాయపల్లి– వీరన్నపల్లి రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారిపై పెద్దాయపల్లి నుంచి వీరన్నపల్లి వరకు రూ.10.61కోట్లతో నిర్మించిన డబుల్‌రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి సంవత్సరం కాకుండానే రహదారి అధ్వానంగా మారింది. రహదారి పక్కన ఇటీవల కొత్తగా వెలిసిన వెంచర్ సమీపంలో ఏర్పడిన గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు గుంతవద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

గాయత్రీమాత జయంతి

గాయత్రి సహస్రనామ జపం చేస్తున్న సభ్యులు

జడ్చర్ల, జూన్ 17 : గాయత్రీమాత జయంతిని సోమవారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. సహస్రనామ జపం, పూజా కార్యక్రమాలు చేపట్టారు. బ్రహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మణసేవాసమితి అధ్యక్షుడు నరేంద్రశర్మ, సుమన్‌శర్మ, రాఘవేంద్ర శర్మ, దత్తుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

మైనింగ్ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంప్

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 17 : అక్రమంగా నిల్వచేసిన ఇసుకడంపులు సీజ్ చేసిన ఘటన ఎర్రవల్లి మండలం కొండపేటలో చోటు చేసుకున్నది. గద్వాల మైనింగ్ ఎస్ఆర్‌వో శ్రీను, ఆర్ఐ షంషేర్ కథనం ప్రకారం కొన్నిరోజులుగా కొండపేట గ్రామానికి చెందిన కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఎడ్ల బండ్లపై కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలించి గ్రామంలో డంపు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం గద్వాల మైనింగ్ అధికారులు ఎస్ఆర్‌వో శ్రీను, ఆర్ఐ షంషేర్, విజయ్ భాస్కర్, ఇటిక్యాల పోలీస్ అధికారులు కలిసి ఇసుక డంపులను సీజ్ చేసి మైనింగ్ అధికారుల సమక్షంలో ఎర్రవల్లి తాసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇసుక 20ట్రాక్టర్లు ఉందని మైనింగ్ అధికారులు తెలిపారు.

ఆరోగ్యశాఖలో బదిలీలు చేపట్టాలి

మహబూబ్‌నగర్, జూన్ 17 : ఆరోగ్యశాఖలోని అన్ని కేటగిరీల ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, టీజీఎంఈయూ పదో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో టీజీఎంఈయూ జెండాను సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయాలన్నారు. పీఆర్సీ, పదోన్నతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని కోరారు. వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మదుసూధన్‌రెడ్డి, పి.సురేష్, చెన్నయ్య, భాస్కర్, కోటేశ్వర్‌రెడ్డి, మొగులయ్య, మైఖేల్, అరుణ్‌కుమార్, సత్యం, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

జెండా ఎగురవేస్తున్న సత్యనారాయణ రెడ్డి

కుక్కల దాడిలో

75 గొర్రెపిల్లలు మృతి

మృతిచెందిన గొర్రెపిల్లలు

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), జూన్ 17: ఊరకుక్కల దాడిలో 75 గొర్రెపిల్లలు మృతి చెందిన ఘటన చింతకుంట మండలంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. చిన్నచింతకుంట మండలం ఫర్దీపూర్‌కు చెందిన పూజారి శ్రీశైలం గొర్రెలను మేతకు తీసుకెళ్లి, చిన్న వయస్సు గల 30 గొర్రెపిల్లలను ఓ చోట వలవేసి దాంట్లో ఉంచాడు. గ్రామంలోని ఊరకుక్కలు వలలో ఉన్న గొర్రెపిల్లలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ గొర్రెపిల్లలన్నీ చనిపోయాయి. అలాగే అదే గ్రామానికి చెందిన పూజారి మల్లప్ప, పూజారి చంద్రప్పకు చెందిన దాదాపు 50 గొర్రెపిల్లలు కూడా కుక్కల దాడిలో మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.5 నుంచి రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు గొర్రెల యజమానులు వాపోయారు. విషయం తెలిసిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము బాధితులను పరామర్శించారు. గ్రామంలో కుక్కలను అరికట్టాలని, పరిహారం అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.